క్లుప్తంగా

రామస్వామి సేవలు మరువలేనివి



రాజుపాలెం: బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీపీ, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామస్వామి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసన సభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ రామస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



సత్తెనపల్లి: కందులవారిపాలెం, గోగులపాడు, పాకాలపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదికకి చెందిన నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త – శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన సంచలనాత్మక ఆధ్యాత్మిక గ్రంథాలు గొప్ప శక్తి కలవన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎలిశెట్టి రమేష్, పోతురాజు, పగడాల రామయ్య, కుంచాల చిన్నవెంకయ్య,పెరుగు ఏడుకొండలు, చల్లగుండ్ల భాస్కరరావు, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాంబాబు



ముప్పాళ్ళ: ఏపీ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిమిరాంబాబు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సంఘం ఎన్నికల్లో బొల్లవరం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు షేక్అబ్దుల్ రజాక్, గౌరవ అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ, అస్కార రావు చేతుల మీదుగా స్వీకరించినట్లు రాంబాబు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



సత్తెనపల్లి: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి రాజీవ్‌గాంధీ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయం, రాజీవ్‌గాంధీ విగ్రహల వద్ద ఆదివారం రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ ఖాజావలి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంలో భారత దేశాన్ని రాజీవ్‌గాంధీ అగ్రగామిగా నిలబెట్టారన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, సీనియర్ నాయకులు చాన్ బాషా, మామిడి శంకరరావు, కోట ఆనంద్, సేవాదళ్ మోహనరావు, జెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా సున్నీ



నకరికల్లు: గుండ్లపల్లి గ్రామంలో గుండ్లపల్లి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత సున్నీ(ఒడుగులు) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని డాక్టర్ అహ్మద్ బుడేకు చెందిన నవీన్ క్లినిక్‌లో సామూహిక సున్నీ చేపట్టారు. సున్నీ చేయించుకున్న వారికి గోదుమపిండి, బెల్లం, కొబ్బరి, నెయ్యి, ఎర్ర తుమాలు, మందుల కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్నాటి ఆణిముత్యాలు

- 'జగనన్న ఆణిముత్యాలు' జాబితా విడుదల
- పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు
- నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున 24 మంది ఎంపిక
- వెల్లడించిన సత్తెనపల్లి ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు





డీవైఈఓ వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాల కార్యక్రమానికి సంబంధించి పల్నాడు జిల్లాలో నియోజకవర్గాల జాబితా సిద్ధమైందని సత్తెనపల్లి ఉప విద్యాశాఖ అధికారి వి.వెంకటే శ్వరరావు చెప్పారు. ఆదివారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల టాపర్ల జాబితాను విడుదల చేశారు. ఈ నెల 25న నియోజకవర్గ, 27న జిల్లా, 31న రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గస్థాయి అవార్డులకు జిల్లా వ్యాప్తంగా 24 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున 21 మందిని ఎంపిక చేశామని, సమాన మార్కులు వచ్చిన మరో ముగ్గురిని అదనంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

సత్తెనపల్లి: 1.జి.శివమాధవరెడ్డి(590), లక్కరాజు గార్లపాడు(జెడ్పీ) 2.ఎన్.జెస్సీకా(580), కుంకులగుంట(జెడ్పీ) 3. జి.వీరేంద్రకుమార్(578), మాదల(జెడ్పీ)

చిలకలూరిపేట: 1. కె.ప్రజ్వల్‌కుమార్(585) చిలకలూరిపేట(జెడ్పీ), 2. పి.నాగయశ్వంత్(578) గణపవరం(జెడ్పీ) 3. కె.నవీన్ (575)గణపవరం(జెడ్పీ).

గురజాల: 1.జి.నవ్యశ్రీ(588) మోర్జంపాడు(జెడ్పీ) 2. షేక్ జాస్మిన్ (586) మాచవరం(జెడ్పీ)3. జి.అభినయ(584) పులిపాడు(జెడ్పీ)

మాచర్ల: 1.కె.పార్వతి(583) తాళ్ళపల్లి (జెడ్పీ), 2. షేక్ సమీరా (577) బాలికోన్నత పాఠశాల మాచర్ల, 3.జి.ప్రవల్లిక(577)మాచర్ల 4.డి. శ్రీవల్లి(576) శిరిగిరిపాడు, వెల్దుర్తి(జెడ్పీ)

నరసరావుపేట: 1.షేక్ తస్లీమా కౌసర్(584) ఎంపీఎల్ బాలికోన్నత 2. కె.నాగఅభయ వరలక్ష్మి (582) ఎంపీఎల్ బాలికోన్నత పాఠశాల,నరసరావుపేట 3. వి.శివకార్తీక్(580)మోడల్ స్కూల్, విప్పర్లరెడ్డిపాలెం.

పెదకూరపాడు: పి.సాయి వినీల(582) జడ్పీహెచ్ఎస్, వేల్పూరు 2. కె.ప్రజ్వల్‌కుమార్(580) జడ్పీహెచ్ఎస్, 88త్యాళ్ళూరు 3. జీఎల్ రత్నమాణిక్యం (576) ఏపీ మోడల్ స్కూల్ క్రోసూరు 4.కె.శ్రీవల్లి(576) ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌పీఆర్‌పీ, అమరావతి.

వినుకొండ: 1.జి.వెంకటేష్(583) ఏపీటీడబ్ల్యూఆర్ఎస్(బి), వినుకొండ 2. సీహెచ్ రోహిత్‌కుమార్ రెడ్డి(582) మోడల్ స్కూల్, చీకటీగలపాలెం 3. జి.సుష్మ(581) మోడల్ స్కూల్, చీకటీగలపాలెం 4. సూరే ప్రేమ్ సాగర్(581)శావల్యాపురం(జెడ్పీ).

జిల్లాకు ముగ్గురు విద్యార్థినులు



మల్లాది గౌతమి



శ్రీపాదపుశరణ్య



ఎం.లక్ష్మీతిరుపతమ్మ

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల మహాత్మా జ్యోతీబాపూలే గురుకులపాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లా స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ ఒంగోలు రాజు ఆదివారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మల్లాదిగౌతమి(556), శ్రీపాదపుశరణ్య(554), ఎం.లక్ష్మీతిరుపతమ్మ(546) పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. వీరు ఈ నెల 27న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.15వేలు నగదు బహుమతి అందుకోనున్నట్లు తెలిపారు.

పిల్లలకు చదువే ఆస్తి



సత్కారం అందుకున్న విద్యార్థులతో ఎంపీడీవో, ఎంఈవో తదితరులు

సత్తెనపల్లి: పిల్లలకు ఇచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది చదువేనని, అంతస్తు, హోదా, అన్నీ పెరగాలంటే మంచి చదువులు ఒకటే మార్గమని సత్తెనపల్లి ఎంపీడీవో జీవి సత్య నారాయణ అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్య సేవా సమితీ అధ్యక్షుడు వెలుగూరి శరత్‌బాబు ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన, పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సభకు ఆర్యవైశ్య సేవ సమితి అధ్యక్షుడు వెలుగూరి శరత్‌బాబు అధ్యక్షత వహించారు. సమాజంలో ప్రతి విద్యార్థి పుస్తక పఠనంతో పాటు మహనీయులు జీవిత ఘట్టాలు తెలుసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల ఫలితాలు అద్భుతాన్ని సృష్టించాయన్నారు. ప్రస్తుతం కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు పోటీపడి ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. వెలుగూరి శరత్‌బాబు, ఏపీపీ బగ్గి నరసింహరావు, ఎలక్ట్రికల్ ఈఈ లోకనాథ్ గుప్తా, శ్రీ బాబా గురుదేవ్ విద్యాసంస్థల అధినేత మట్టా సుబ్రమణ్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవరశెట్టి రవికుమార్, మానవ హక్కుల సంఘం చైర్మన్ ఎస్వీ రామారావు, శిశుమందిర్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు. మొత్తం 22 పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు సాధించిన 22 మందికి, ఇతర ప్రాంతాల్లో చదివిన పట్టణానికి చెందిన ఐదుగురికి మొత్తం 27 మందికి చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి దివ్వెల శ్రీనివాస రావు, గౌరవ అధ్యక్షుడు జమిలి రాధాకృష్ణమూర్తి, కోశాధికారి మద్ది వెంకటేశ్వరరావు, కార్యదర్శి కొత్తూరి విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య, వైఎస్ఆర్ సీపీ నాయకుడు కోడిరెక్క దేవదాస్, షేక్ జానీ, నోముల సురేష్, చిలకల వాసు, కుంచనపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అమరావతి: మరో రెండు రోజులు వడగాలుల వీచే అవకాశం ఉందని వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రవిబాబు సూచించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆదివారం ఆయన వివరించారు. పరిశుభ్రమైన తాగునీటిని ఎక్కువగా తీసుకోవాలని, ఎండ ఉధృతి ఎక్కువగా ఉండే మధ్యాహ్నం బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. సిల్క్ దుస్తులు కాకుండా కాటన్ దుస్తులను వాడాలని, నలుపు దుస్తులను, ముదురు రంగుల దుస్తులను వీలైనంత వరకు దూరంగా ఉంచాలని చెప్పారు. కొబ్బరినీరు, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలని, గొడుగును వాడాలని చెప్పారు. వడదెబ్బ తగిలితే.. తడిగుడ్డతో ఉష్ణోగ్రత తగ్గేవరకు తుడవాలని సూచించారు. వెంటనే వైద్యుని సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు ఉదయం 11 తర్వాత, సాయంత్రం 4గంటల లోపు ఎండలో తిరగటం మానుకోవాలన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

బొల్లాపల్లి: కాయల కోసం తాటి చెట్టు ఎక్కి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దోమలగుండంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పోలేపల్లి ఏసుబాబు (24) సమీపంలోని పొలాల్లో తాటికాయల కోసం చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తొలుత ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఏసుబాబు మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

మదరస్సాకు ఆర్థిక సాయం

చిలకలూరిపేట టౌన్: జ్ఞానేశ్వర ఫౌండేషన్ ద్వారా పేదలకు షేక్ జాన్‌సైదా ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని వేలూరు గ్రామ ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. గత నెలలో రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి ముస్లింకు తోఫా ఉచితంగా అందజేశారని కొనియాడారు. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇస్లామున్సా మదరసాకు జాన్‌సైదా రూ. 50వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, గ్రామ ముస్లిం మత పెద్దలు పఠాన్ అల్లాబక్షు, ఖాదర్‌వలి, ఖాసీం పీరా, సుభాని, బాజీ పాల్గొన్నారు.

ముగిసిన కళాసాగరి ఉత్సవాలు



ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో కళాసాగరి ట్రస్ట్ నాట్య ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల్ని ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య పోటీల్లో గుంటూరు, ఒంగోలు, నరసరావుపేట, కందుకూరు, వినుకొండ తదితర ప్రాంతాలకు చెందిన 60 మంది బాలలు పాల్గొన్నారు. గణేష్ రత్తయ్య స్మారక ఆదర్శ రైతు సత్కారాన్ని ఉమ్మడివరం గ్రామానికి చెందిన రైతు వీరగంధం రత్తయ్యకు అందజేశారు. అనంతరం డ్యాన్స్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బొల్లా బహుమతులు అంతజేశారు. కూచి రామాంజనేయులు, సదాశివరావు, బ్యాంక్ నాగేశ్వరరావు, ముత్తినేని గిరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, వై.ఆదిరాములు, జయచంద్రపాల్, కమలారాం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణలో మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఆంధ్ర భోజుడుగా కీర్తి ప్రతిష్టలు పొందిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని కొనియాడారు. పట్టణంలోని భాస్కర్ సెంటర్‌లోని రోడ్డు డివైడర్‌పై శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరుకున్నట్లు చరిత్ర చెబుతుందన్నారు. తెలుగు, కన్నడ ప్రజలతో పాటు భారత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ఒకరని తెలిపారు. ఆయన విగ్రహ ఏర్పాటు ద్వారా భావితరాలకు ఆయన ఆదర్శాల్ని చేరవేసే అవకాశం కలుగుతుందని వివరించారు. విగ్రహ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, విగ్రహ కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట రామచంద్రప్రసాద్, అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, పొన్నం చంద్రశేఖర్, మిరియాల లక్ష్మీనారాయణ, గాలి బుచ్చయ్య, ఇక్కుర్తి పవన్‌కుమార్, వట్టిం శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా సుబ్బగురు యోగీంద్రస్వామి తిరునాళ్ల



పొంగళ్లు చేస్తున్న భక్తులు

బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరులో సుబ్బగురు యోగీంద్ర స్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దాతలు చిట్టి గోపాలరెడ్డి, కుంటా కోటిరెడ్డి అన్నదానం చేశారు. షిర్డీ సాయి ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో నాలుగు భారీ విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. భక్తుల ఉల్లాసం కోసం నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో గ్రామాలు



నాగవరంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ మహబూబ్‌సుభాని



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్సై ఇమామ్



మాట్లాడుతున్న సీఐ శోభన్‌బాబు

నాగవరం(క్రోసూరు): ప్రతి గ్రామంలో ప్రజలు కలిసిమెలసి ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని, అప్పడే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఇన్‌చార్జి ఎస్‌ఐ మహబూబ్ సుబాని అన్నారు. నాగవరం గ్రామంలో శనివారం రాత్రి ఆయన పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామ సచివాలయంలో బసచేసారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. గ్రామంలో ప్రజలందరూ చక్కటి సృహుద్భావ వాతవరణంలో మెలగాలని కోరారు. గ్రామపెద్దలు సమస్యలు పరిష్కరించేందుకు దోహదపడాలన్నారు. ఘర్షణల్లో రాజీ మార్గం ఉత్తమ మార్గమని అన్నారు. పేకాట, అసాంఘిక కార్యాకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోలీసుసిబ్బంది, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో పల్లెనిద్ర

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): దమ్మాలపాడు గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. ఏఎస్సై ఎస్కే ఇమామ్ పాల్గొన్నారు. గ్రామంలో చట్ట విరుద్ధంగా చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామసచివాలయంలో నిద్రకు ఉపక్రమించారు.

16వ వార్డులో సీఐ పల్లె నిద్ర

సత్తెనపల్లి: పట్టణంలోని 16 వార్డులో శనివారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం జరిగింది. సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్ బాబు పాల్గొని, స్థానికులతో మాట్లాడారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అక్కడే నిద్ర చేశారు. మాజీ కౌన్సిలర్ నందిగామ ఆదాం సీఐ శోభన్ బాబును సత్కరించారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో..పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నాగుర్‌మీరాన్

సత్తెనపల్లి: 'మేరీ లైఫ్, మేరీ స్వచ్ఛ షహర్' ప్రచారంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్) కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత దుస్తులు, చెప్పులు, గాజు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగం కోసం కొత్త ఉత్పత్తులుగా చేయడానికి ఉపయోగిస్తారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వ్యర్థాలను కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్, ఈ–వేస్ట్ వల్ల హానికరమైన కెమికల్స్ ఉత్పత్తి పర్యావరణానికి హాని కలుగజేస్తున్నాయన్నారు. ప్రజలంతా మున్సిపల్ కార్మికులకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, శానిటరీ సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ



కార్యాలయంలో రౌడీషీటర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

నరసరావుపేట: రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలని, ప్రజాశాంతికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై పోలీసుల నిఘా నిరంతరమూ ఉంటుందని, సత్ప్రవర్తనతో మెలుగుతూ తీరు మార్చుకొని పోలీసులకు ఇన్ఫార్మర్లుగా వ్యవహరించాలని సూచించారు. గత అనుభవాల్ని మరిచి మళ్లీ తప్పులు చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని, మంచి నడవడికతో మసులుకుంటే రౌడీషీట్ ఎత్తివేస్తామని చెప్పారు. సమావేశంలో సబ్ డివిజన్ సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నిరుపేద బ్రాహ్మణులకు చేయూత



బియ్యం, నూతన వస్త్రాలు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవ రావు కార్యాలయంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాల్ని ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్, లాయర్ గిరిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు. సేవా సమితి తరపున అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, చింతలపూడి భద్రయ్య, పుట్టం రాజు బేబీ సరోజిని, నారాయణరావు, భాస్కరరావు, బాబు, విష్ణుశ్వరి, రామారావు, రవికిరణ్, భువనగిరి సుబ్రహ్మణ్యం, ఎం.వి.శర్మ, నాగేశ్వరరావు, మల్లికార్జునశాస్త్రి పాల్గొన్నారు.

కాళహస్తీశ్వర ఆలయ ముఖద్వారం ప్రారంభం నేడు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సింహద్వారం

రెంటచింతల: పాలువాయి గ్రామంలోని అతి పురాతనమైన శ్రీ గంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ముఖద్వారం ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావుకృష్ణదేవరాయిలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన విభాగం కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సోమవారం రానున్నట్లు సర్పంచ్ మందలపు విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖద్వారం నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు మందలపు హనిమిరెడ్డి, మందలపు సైదారెడ్డి వారి పూర్వికుల జ్ఞాపకార్థం చేపట్టారు. ఆలయ ప్రధానార్చకులు గార్లపాటి శివప్రసాద్ నేతృత్వంలో ఆగమ శాస్త్ర పండితులు జిగురు చంద్రశేఖరశర్మ, జిరుగు ప్రసాదశర్మ, జిగురు శంకర్‌శర్మ ఉదయం 8.52గంటలకు సింహద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.